# నామదురద ::

పగడాల హరిప్రసాదరావు
(జాతీయ రచనామండలి)

"దయచేయండి సీతాపతిగారూ!" అన్న ముక్క హోటలు ప్రొప్రయిటరు రంగనాథం నోటినుండి రాగానే, ఆశ్చర్యపోయాను నా "పెన్ నేమ్" యితనికెలా తెలిసిందా అని.

పదిహేను రోజులనుంచీ ఆ హోటలులోనే కాఫీ త్రాగుతున్నా వొక్కనాడైనా పలుకరించని రంగనాథం ఆరోజున ఆహ్వానించడం—వట్టి ఆహ్వానమేకాకుండా నాప్రక్కనుకూర్చుని రెండు స్వీట్లూ, అణామిక్చరూ, కప్పు స్పెషల్ కాఫీతో నన్ను తన అతిథిగా చేసుకోవడంతో నాబుర్ర పజిల్ సాల్వ్ చేయసాగింది. డబ్బుదగ్గర నాలుగుసార్లు బలవంతం పెట్టించుకుని బయటపడ్డాను.

రెండవ రోజునకూడా అదేవిధంగా జరగడంతో యింక లాభంలేదని నాలుగురోజులు రంగనాథం హోటలుకు మన్నా చెప్పా.

రంగనాథం నన్ను యెందుకంత గౌరవించాడో తన్నుకున్నా అర్థంకాలేదు. ఆఫీసులో క్రొత్తగా మిత్రుడైన మణ్యంతో రంగనాథం విషయమేమిటో తెల్సుకుందామని కదలేశా.

"రంగనాథం తండ్రి పది సంవత్సరాలనుండీ వాణీపురంలో హోటలుపెట్టి కొంచెం బాగా గడించాడు. సంవత్సరంక్రితమే హోటలు రంగనాథం చేతిలోపెట్టి తనయాత్ర...

అసలే పేరు వాణీపురం దానికితగినట్టు పండితులు, కవులు, భావకవులు, అభ్యుదయ రచయితలూ, పిల్లరచయితలు చాలామంది పుస్తకాలు, పత్రికల నిండా సముద్రాలు, సెలయేళ్లు, ఆకటిజ్వాలలు, పిల్లకాల్వలూ ప్రవహించ చేయసాగారు.

ముప్పాదికమంది జర్నలిష్టులంతా రంగనాథం కాఫీకి అలవాటుపడినవారే! కలిగిన అతిపరిచయంతో వాళ్ళకొచ్చే పత్రికలు చదవగా చదవగా రంగనాథానికికూడా దురద బయల్దేరింది. దానితో నాలుగుదస్తాల కాగితాలు ఖరాబుచేశాడు. ఆఖరికి వొకసారి అతనికథ పత్రికలో ప్రకటింపబడడంతో వున్నకొలతకు రెట్టింపుఅయ్యాడు.

ఆరోజున వూళ్ళోవున్న రచయిత లందరికీ మరోపేరుతో టీపార్టీ చేశాడు.

అప్పటినుండీ ప్రతిరచయితను కాస్త పరిచయంచేసుకోవడం...అతనితో తను వ్రాసినవాటిని సరిచూపించుకోవడం బాగా అలవాటయింది"

అంటూ మణ్యం రంగనాథంచరిత్ర చెప్పాడు.

ఆరోజు రాత్రి హోటలు మెతుకులు కుక్కుకు నొచ్చి గదిలో కూర్చున్నా. మనసు మహావేదన పడుతూంది...యేమన్నా వ్రాద్దామని. ఊహలు ఒకదానిపై ఒకటి దొర్లసాగాయి. కాగితంమీద కలం పెట్టబోయేప్పటికి బయట తలుపుచప్పుడు...లేచి తలుపు తెరిచేసరికి...రంగనాథం ప్రత్యక్షం ముసిముసినవ్వులతో.

'ఏమండోయ్! ఇలా వచ్చారు! రండి! రండి! అంటూ లోనికి దారితీసాను.

'అబ్బే! ఏమీలేదండీ! ఇటు పనుండివచ్చా! నాలుగురోజులనుండీ మీ దర్శనమే లేదే!' అంటూ నన్నుసురించాడు.

'ఆ! తొందర పనులవల్ల రావడంలేదు! కూర్చోండి!' లోకాభిరామాయణం ప్రారంభించాం...

'ఈమధ్య మీ రచనలేమీ కనుపించడంలేదే!' అన్నాడు నాథం.

'ఏమిరచనలండీ! మనం పత్రికలకు వ్యాసాలు పంపడం ఒక దురలవాటుక్రింద పరిణమిస్తూందిగాని మరేమీలేదు. ప్రతిఫలం యేం చూచుకుని మనం రచనలు సాగించాలి. ఇదొక నామదురద. అన్నట్టు మీరుకూడా యేమీ రాయడం లేదా!' అన్నాను.